# ప్రజా ప్రభుత్వం కాదు.. ఫాసిస్ట్ ప్రభుత్వం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు వివేకానంద్, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

- ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే హరీష్‌రావుపై అక్రమ కేసులు
- ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

**దుండిగల్:** కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదని, ఇది ఫాసిస్టు ప్రభుత్వ పాలన అని ఎమ్మెల్యే వివేకానంద్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. బుధవారం గండి మైసమ్మలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి, నేడు విస్మరించారన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని నట్టేట ముంచారన్నారు. ప్రజల హామీలపై ప్రశ్నిస్తే రేవంత్ ప్రభుత్వం కేసులు నమోదు చేస్తోందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి ఆధారాలు లేకుండా మాజీ మంత్రి హరీష్‌రావుపై కేసులు నమోదు చేయడం సరికాదని అన్నారు. చక్రధర్‌గౌడ్ అనే చీటర్ ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తారా? అని వారు ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకు అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్ నియోజకవర్గంలోని కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి తన చావుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులే కారణం అని నోట్ రాసిపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడని, నేటి వరకు పోలీసులు ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హద్దులు దాటుతున్నారని, కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులపై బుల్డోజర్లు ఎక్కిస్తామని అంటున్నా పోలీసులు కేసు నమోదు చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ నేతల గొంతు నొక్కాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తక్షణమే మాజీ మంత్రి హరీష్‌రావుపై పెట్టిన బూటకపు కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణం సీజ్



**రంగారెడ్డినగర్:** అక్రమ నిర్మాణాలపై సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కన్నెర్ర జేశారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఏపీహెచ్ కాలనీని ఆనుకుని ఐడీపీఎల్– జగద్గిరిగుట్ట రోడ్డులో ఇటీవల నిర్మించిన మూడంతస్తుల భవనాన్ని కుత్బుల్లాపూర్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. సదరు నిర్మాణం చేపడుతున్న సమయంలో ఫిర్యాదులు అందినా అప్పట్లో అధికారులు పట్టించుకోలేదు. దీంతో నిర్మాణదారుడు అనుమతి లేకుండానే తక్కువ విస్తీర్ణం ఉన్న స్థలంలో సెల్లార్ తవ్వడంతో పాటు మూడు బోర్లు వేశాడు. స్థానిక టౌన్‌ప్లానింగ్ అధికారులకు నిర్మాణదారుడి నుంచి మామూళ్లు అందడంతో చూసీచూడనట్లు వదిలేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కూకట్‌పల్లి జోనల్ కార్యాలయానికి ఫిర్యాదు అందడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో స్థానిక అధికారులు అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేశారు.

## యువ వికాసానికి తరలిన గ్రూప్–4 అభ్యర్థులు



**సాక్షి,సిటీబ్యూరో:** ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా బుధవారం పెద్దపల్లిలో నిర్వహించిన యువ వికాసం కార్యక్రమానికి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నుంచి గ్రూప్–4 లో ఉత్తీర్ణులైన 511 మంది అభ్యర్థులు తరలివెళ్లారు. కలెక్టరేట్ కార్యాలయం వద్ద వీరి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 11 బస్సులను జెండా ఊపి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అధికారి సాంబశివరావు ప్రారంభించారు. అభ్యర్థుల భద్రత దృష్ట్యా ప్రతి బస్సుకు ఒక కానిస్టేబుల్, ఒక లైజన్ అధికారిని నియమించారు. బస్సుల్లో తరలివెళ్లిన అభ్యర్థులకు మధ్యాహ్నం, రాత్రి భోజనాల వసతి కూడా కల్పించారు. కార్యక్రమంలో ఏఓ రామ్మోహన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్, డీటీఓ వెంకటేశ్వర్లు, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు నేల సంరక్షణపై అవగాహన

**సాక్షి, సిటీబ్యూరో:** ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని రైతు వేదికలలో మృత్తిక (నేల) సంరక్షణపై గురువారం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రకళ తెలిపారు. మానవాళికి ఆహారం అందించే నేలని సంరక్షించుకుంటేనే భావితరాలకు ఆరోగ్యకరమైన ఉత్పత్తుల్ని అందించే వ్యవసాయాన్ని పండుగలా చేయగలమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను ప్రతి రైతు వేదికలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో జిల్లాకు చెందిన రైతు సోదరులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొంటారన్నారు. వ్యవసాయ అధికారులతో సహా కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు కూడా పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారులు మట్టి నమూనాలు సేకరించే పద్ధతితో సహా నేల ఆరోగ్య సూచికను ఎలా అర్థం చేసుకోవాలో రైతులకు వివరిస్తారన్నారు.

# అనుమతి ఒకలా.. నిర్మాణం మరోలా

- భారీ బిల్డింగ్‌ను సీజ్ చేసిన అధికారులు
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



నిర్మాణాన్ని సీజ్‌చేసి తాళాలు వేస్తున్న అధికారులు

**కుత్బుల్లాపూర్:** ప్రధాన రోడ్డుపైనే అక్రమ నిర్మాణం చేపడుతున్న భారీ భవనాన్ని కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులు సీజ్ చేశారు. సుచిత్ర నుంచి కుత్బుల్లాపూర్‌కు వెళ్లే రోడ్డులో జయరాం నగర్ హనుమాన్ దేవాలయం పక్కనే ఓ వ్యక్తి సుమారు 400 గజాలకు పైగా ఉన్న ఈ స్థలంలో రెసిడెన్షియల్ పర్మిషన్ తీసుకొని ప్రధాన రోడ్డుపైనే కమర్షియల్ బిల్డింగ్ నిర్మిస్తుండటంపై పలు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో అధికారులు నోటీసులు జారీ చేస్తూ వచ్చారు. అయినప్పటికీ సదరు బిల్డింగ్ యజమాని డోంట్ కేర్ అన్నట్లుగా నిర్మాణాన్ని కొనసాగించాడు. బుధవారం సర్కిల్ ఉప కమిషనర్ నరసింహ నేతత్వంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ సురేందర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది సదరు బిల్డింగ్‌ను సీజ్ చేశారు.

**ఫిర్యాదులు వచ్చినా నాడు పట్టించుకోలే!**

సంవత్సర కాలంగా ఇక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణంపై పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా కేవలం నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ టౌన్ ప్లానింగ్ అధికారి పెద్ద ఎత్తున సదరు బిల్డింగ్ యజమాని నుంచి నోటీసుల పేరుతో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు అధికారి బదిలీ కాగా.. కొత్తగా వచ్చిన అధికారులు నోటీసులు జారీ చేశారు. కూకట్‌పల్లి జోనల్ టాస్క్ ఫోర్స్‌కు సమాచారం ఇచ్చి ఫైనల్ నోటీసు జారీ చేయగా.. బిల్డింగ్ యజమాని మాత్రం ఏ కోశానా అధికారులకు సహకరించకుండా నిర్మాణ పనులు చేపట్టడంతో అధికారుల తీరుపై విమర్శలు వచ్చాయి. ఎట్టకేలకు టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ భవనాన్ని సీజ్ చేశారు.



అధికారులు సీజ్ చేసిన భవనం

### నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం



నిర్మాణ పనులు జరుగుతున్న క్రమంలోనే నోటీసులు జారీ అయ్యాయి. నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారు. నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో భవనాన్ని సీజ్ చేశాం. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఊరుకునేది లేదు.

– రమేష్, కుత్బుల్లాపూర్ టౌన్ ప్లానింగ్ అధికారి

# నెలల తరబడి అక్కడే పార్కింగ్

**అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం**

- ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలు
- అధికారులు స్పందించాలని వేడుకోలు

**జగద్గిరిగుట్ట:** డివిజన్ పరిధిలో పలు చోట్ల అక్రమ పార్కింగ్ అడ్డాలు ఎక్కువయ్యాయి. రోజులు, నెలల తరబడి వాహనాలు అక్కడే ఉంటున్నాయి. రాత్రి సమయాల్లో పార్కింగ్ చేసిన వాహనాల వద్ద మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఆ రోడ్ల నుంచి వెళ్లాలంటేనే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పార్కింగ్‌ల వద్ద ప్రతీ రోజు ఏదో ఒక చోట తాగి గొడవలు జరుగుతుండటంతో స్థానిక ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది. వేంకటేశ్వర స్వామి ఆలయ మెట్ల దగ్గర, అంజయ్య నగర్ ప్రాథమిక పాఠశాల వద్ద, జగద్గిరి గుట్ట కొండపై ఉన్న గోవిందరాజస్వామి ఆలయం వద్ద పార్కింగ్ చేసిన వాహనాలు 2–3 నెలల నుంచి అక్కడే ఉంటున్నాయి.



జగద్గిరిగుట్ట కొండపై ఉన్న గోవిందరాజస్వామి ఆలయం ముందు

**పార్కులను సైతం పార్కింగ్‌గా..**

అలాగే రాజీవ్ గృహకల్పలో ఉన్న పార్కులను సైతం అక్రమ పార్కింగ్‌కు అడ్డాలుగా మార్చుకున్నారు. ఈ సముదాయంలో 5 పార్కులు ఉండగా.. అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇక్కడ కూడా రాత్రి సమయాల్లో తాగి స్థానికులను ఇబ్బందులకు గురి చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ విషయమై పలు మార్లు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. ఆ సమయంలో కొంత పోలీసుల పహారాతో తగ్గినా.. ఆ తర్వాత షరమామూలే. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి వాహనాల అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అంజయ్య నగర్ ప్రాథమిక పాఠశాల సమీపంలో..



రాజీవ్ గృహకల్ప 1వ బ్లాక్ పార్క్ వద్ద..

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**సాక్షి, సిటీబ్యూరో:** రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. యువత స్వయం శక్తితో వ్యాపార, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు యూనియన్ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ జ్యూట్ బ్యాగ్ తయారీ ప్రోగ్రాంలో ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ఉచిత శిక్షణ ఈ నెల 6 నుంచి 13 రోజుల పాటు కొనసాగనుంది. ఉచిత శిక్షణకు 19 నుంచి 45 సంవత్సరాల వరకు ఉన్న వారు అర్హులని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డులతో పాటు 3 ఫొటోలు వెంట తీసుకువెళ్లాల్సి ఉంటుంది. శిక్షణ పొందే అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి కల్పిస్తారు. సందేహాలుంటే 9391487797, 9177141712, 9618534720, 6301890681, 9441728468 ఫోన్ నంబర్లలో సంప్రదించగలరని స్వర్ణ భారత్ ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది.

## గంజాయి విక్రేతల అరెస్టు

**బాలానగర్:** బాలానగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫతేనగర్ వడ్డెర బస్తీలో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు చేసి గంజాయి విక్రేతలను అదుపులోకి తీసుకున్నారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలోని పార్థీవాడకు చెందిన కవిత (37) తన అనుచరుడు ముస్తఫాహుస్సేన్ (34) ఇరువురు ధూల్‌పేట నుంచి గంజాయి తీసుకువచ్చి అనుచరుల ద్వారా గంజాయి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఎక్సైజ్ పోలీసులు వారి గృహంపై దాడి చేసి కిలో 500 గ్రాముల గంజాయి, రూ.17 వేల నగదు, 2 మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం బాలానగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గాయత్రి, వరలక్ష్మి అనే ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# కాంగ్రెస్‌ది ప్రజారంజక పాలన



పన్యాల శ్రవణ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న శ్రీశైలంగౌడ్, హన్మంతరెడ్డి

**కుత్బుల్లాపూర్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారంజక పాలనను కొనసాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం జీడిమెట్ల డివిజన్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ ప్రజాపాలన విజయోత్సవాల కో ఆర్డినేటర్ పన్యాల శ్రవణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఎగరవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలను రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా అమలు పరుస్తోందన్నారు. మహాలక్ష్మి గ్యారంటీ కింద మహిళలకు త్వరలో రూ.2,500 లను సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బేక శ్రీనివాస్, నాయకులు రంగయ్య, మధుసూదన్ రెడ్డి, నర్సింగ్‌రావు, పావని, సుజాత యాదవ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

## ఘనంగా అయ్యప్ప పడిపూజ

**కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ డివిజన్ ప్రసూన నగర్‌లోని కోదండ రామాలయంలో బుధవారం భాస్కర్ నాయుడు, నాగమణి దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 41 రోజుల పాటు దీక్షతో స్వామి వారిని కొలుస్తున్న స్వాములకు అయ్యప్ప దీవెనలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# మోసపూరిత కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు



గులాబీ కుండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్‌పల్లి:** మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్‌నగర్ డివిజన్‌లోని ఉద్యమకారుడు శ్రీకాంత్, కూకట్‌పల్లి డివిజన్ మాజీ అధ్యక్షులు లక్ష్మీనారాయణలతో పాటు 50 మంది ముఖ్య నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలమైనా ఇప్పటి వరకు పెన్షన్లు పెంచలేదని, అందించాల్సిన సంక్షేమ పథకాలు అమలు చేయకపోగా విజయోత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకొని ఉద్యమకారులు, ప్రజలు తిరిగి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని, రాబోయే రోజుల్లో మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ రంగారావు, ఎర్రబెల్లి సతీష్ రావు, పెద్ద భాస్కర్, సింగం శ్రీకాంత్, నరసింగ్‌రావు, విష్ణు, రషీద్, రాము, షాద్గుల్లా, రవీందర్, బాలరాజు యాదవ్, రబ్బానీ, నరేందర్ రెడ్డి, సాజిద్, రాంబాబు, వెంకట్‌రావు, షరీఫ్, హమీద్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

**డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తి చేయాలి**

**కేపీహెచ్‌బీకాలనీ:** డ్రైనేజీ పైపులైన్ పనుల్లో జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ నుంచి గోపాల్ నగర్ మార్గంలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులు, బాలాజీనగర్ డివిజన్ కైత్లాపూర్ పార్కు వద్ద డ్రైనేజీ లేక రోడ్ల పైన నీరు చేరిన ప్రాంతాన్ని కార్పొరేటర్‌లు మందడి శ్రీనివాసరావు, శిరీషతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన డ్రైనేజీ పైపు లైన్ పనుల్లో జాప్యం జరుగుతోందని, అధికారులు ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలన్నారు. బాలానగర్ డివిజన్ కైత్లాపూర్ పార్కు వద్ద డ్రైనేజీ నీరు రోడ్డుపై చేరడం వల్ల ప్రజలు నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని, డ్రైనేజీకి కావలసిన నిధులు అంచనా వేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడిగా కృష్ణగౌడ్



నియామకపత్రం అందుకుంటున్న కృష్ణగౌడ్

**జగద్గిరిగుట్ట:** ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడిగా సారా కృష్ణగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం జగద్గిరిగుట్టలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమ సంఘం కార్మికులకు రక్షణ కల్పించే కార్మిక సంఘమని, పారిశ్రామిక వాడలో జరుగుతున్న ప్రమాదాలపై సమగ్ర రిపోర్టు తయారు చేసి సీఎంకు అందజేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో గూడ ఐలయ్య గౌడ్, నడిమింటి నాగరాజు, సతీష్, ఎం జనార్దన్, చాంద్ పాషా, పాండు గౌడ్, శంకర్, భానుచౌదరి తదితరులు పాల్గొన్నారు.

## శివ స్వాముల పాదయాత్ర



**జగద్గిరిగుట్ట:** గురుస్వామి బండి సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం జగద్గిరిగుట్ట నుంచి శ్రీశైలం వరకు శివ స్వాములు పాదయాత్ర ప్రారంభించారు. 10 రోజుల పాటు కందుకూరు, కల్వకుర్తి మీదుగా ఈనెల 13వ తేదీన శ్రీశైలం చేరుకుంటారని, 41 రోజుల పాటు దీక్షలో ఉన్న సుమారు 60 మంది శివ స్వాములు ఈ పాదయాత్రలో పాల్గొంటున్నట్లు సత్యనారాయణ తెలిపారు.

## అగ్ని ప్రమాదాలతో మానవాళికి ముప్పు



ప్రశాంతవనం పార్కులో అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఎస్ఓ ప్రవీణ్

**జీడిమెట్ల:** అడవిలో అగ్ని ప్రమాదాలు జరిగితే ప్రాణవాయువును ఇచ్చే పచ్చని చెట్లు కాలిపోతాయని ఫారెస్ట్ సెక్షన్ అధికారి ప్రవీణ్ అన్నారు. బుధవారం ఉదయం ఎస్.ఆర్.నాయక్‌నగర్‌లోని ప్రశాంతవనం పార్కులో అడవిలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో మాట్లాడుతూ.. మనల్ని కాపాడే ప్రకృతిని మనం కాపాడుకోవాలని సూచించారు. నడిచే క్రమంలో సిగరెట్, బీడీ లాంటి వాటిని విసిరివేయరాదని సూచించారు. అదేవిధంగా అడవిలో జంతువులు, పక్షులను వేటాడితే వన్యప్రాణి చట్టం ప్రకారం 7 సంవత్సరాల జైలుశిక్ష తప్పదని వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ వీరబాబు, వాకర్స్ పాల్గొన్నారు.

## ముగిసిన వన భోజనాలు



వన భోజనంలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు

**జీడిమెట్ల:** జీడిమెట్ల డిపోలో నిర్వహించిన వన భోజనాల మహోత్సవం బుధవారం ముగిసింది. ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ ఆర్ఎం రాజశేఖర్ హాజరై మాట్లాడారు. డిపోలో వన భోజనాలు నిర్వహించడం వల్ల ఉద్యోగులకు సంస్థ పట్ల ఎక్కువ నమ్మకం కలుగుతుందని అన్నారు. అనంతరం ఉద్యోగుల కుటుంబీకులకు నిర్వహించిన ఆటలపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం కవిత, జీడిమెట్ల డిపో మేనేజర్ ఆంజనేయులు, ఏఎంటీ నీలమణి, ఎంఎఫ్ సందీప్, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల బంద్ పోస్టర్ ఆవిష్కరణ



**సుభాష్‌నగర్:** ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికై డిసెంబర్ 7న జరిగే బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. బుధవారం షాపూర్‌నగర్ చౌరస్తాలో ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బంద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. మహిళలకు ఉచిత బస్సుతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. తాము అధికారంలోకి రాగానే సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామని ప్రకటించిన సీఎం ఇప్పుడు దాటవేసే ధోరణిని అవలంభిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఖలీల్, వినయ్, శ్రీనివాస్, ఖాజా పాల్గొన్నారు.

## ఎయిర్‌బస్ సంస్థతో మహీంద్రా యూనివర్సిటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

**సుభాష్‌నగర్:** దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లికి చెందిన మహీంద్రా యూనివర్సిటీ, ఎయిర్‌బస్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. బుధవారం యూనివర్సిటీ క్యాంపస్‌లో చాన్స్‌లర్ ఆనంద్ మహీంద్రా సమక్షంలో యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ యాజులు మెదురీ, ఎయిర్‌బస్ ఇండియా దక్షిణాసియా ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ రెమి మైలార్డ్ ఈ ఎంఓయూపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ ఎయిర్‌బస్ విమానయాన, అంతరిక్ష రంగంలో ప్రసిద్ధి చెందిందని, ఈ భాగస్వామ్యంతో ఇన్నోవేషన్, రీసెర్చ్, ఎడ్యుకేషన్ రంగంలో యూనివర్సిటీల విద్యార్థులకు లబ్ధి చేకూరనుందన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా విమానయాన, డిజిటల్ సాంకేతికతలలో ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషిన్ లెర్నింగ్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాలలో పాఠ్యాంశ అభివృద్ధి, పరిశ్రమ శిక్షణ, అధ్యాపకులు, ఆధునిక పరిశోధనలో భాగస్వామ్యం చేస్తామన్నారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో సింపోజియం, వర్క్‌షాప్ వంటి సంయుక్త ఈవెంట్‌ల నిర్వహణ, అంతర్జాతీయ సంస్థలతో సంబంధాలు ఏర్పరచడంలో సహాయపడుతుందన్నారు.